నాగోలును క్లీన్, గ్రీన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



దీఈ నీలిమను సన్మానిస్తున్న కార్పొరేటర్

నాగోలు: నాగోలు డివిజన్‌ను క్లీన్,గ్రీన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. నూతన శానిటేషన్ డీఈగా వచ్చిన నీలిమను శనివారం వార్డు కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో శానిటైజేషన్ శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వినాయక చవితిని పురస్కరించుకొని మండపాల వద్ద నిర్వాహకులు శుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రబాబు, లక్ష్మయ్య, శ్రీనివాసచారి, వెంకటస్వామి,తన్వీర్, రవి, కుమార్, మహిపాల్ సాయి పాల్గొన్నారు.అనంతరం డివిజన్‌కు చెందిన పలువురికి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు.

నేడు పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తాం

- కరుణాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

నాగోలు: పాత పెన్షన్(ఓపీఎస్)ను తీసేసి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న ఈ స్కీమ్ ఉద్యోగుల పాలిట చీకటి రోజు అని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు యాసాని కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఉద్యోగులు నిరసన దినంగా పాటిస్తారన్నారు. పాత పెన్షన్‌ను సాధించుకోవడానికి ప్రతి ఉద్యోగి నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మండప నిర్మాణానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధి కాస్మోపాలిటన్‌కాలనీలో నిర్మిస్తున్న వినాయక మండప నిర్మాణానికి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ బంధువులు మొదటగా పూజించేది వినాయకుడినని, మండపానికి విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రుద్ర లక్ష్మీనర్సింహా, గంజి సత్తయ్య, శ్రీనివాసరావు కుంట్ల సుధాకర్, జ్ఞానేశ్వర్, భీమయ్య పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమాట రూ. 15, వంకాయ రూ. 23, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 13–28, కాకర రూ. 23, బీర రూ.35, క్యాబేజి రూ. 15, ఫ్రెంచి బీన్స్ రూ. 75, క్యారెట్ రూ. 50, దొండ రూ. 23–25, చిక్కుడు రూ. 60, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 45, ఆలు రూ. 38, దోస రూ. 13, సొర రూ. 11, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 49, చామగడ్డ రూ. 37.
ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ప్రత్యేక పూజలు



నాగోలు: నాగోలు డివిజన్ పరిధి బండ్లగూడ శ్రీనివాస్‌కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం శనివారం సందర్భంగా స్వామికి 1016 అరటి పండ్లు అలంకారణ, సహస్ర అష్టోత్తర కదిలీ పల పూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం శనిత్రయోదశి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

హైడ్రా ఓ డ్రామా: సామ రంగారెడ్డి



మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమై ప్రజల దృష్టిని మరల్చేందుకు హైడ్రాతో ఓ డ్రామా ఆడుతుందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. మన్సూరాబాద్ చంద్రపురికాలనీలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం అమలుకు నోచుకోలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయలేక చేతులేత్తేసిందన్నారు. ప్రజలు ఎక్కడ హామీలు, గ్యారంటీలను అడుగుతారనే భయంతో హైడ్రా ఏర్పాటు చేసి దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బడాబాబులను రక్షించి పేదలను భయభ్రాంతులకు గురి చేయటమే హైడ్రా ఏర్పాటని ఎద్దేవా చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై చేసిన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కొత్త రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు రంగ నర్సింహాగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, పవన్‌కుమార్, నాయకులు చింతల సురేందర్‌యాదవ్, పంగ శ్యాం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మన్సూరాబాద్ రోడ్డుపై పారుతున్న వరద



వర్షంలో గొడుగు సహాయంతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు



ఆనంద్‌నగర్, మన్సూరాబాద్ రోడ్డులో పారుతున్న వరద లోంచి వెళ్తున్న వాహనదారులు

ముసురుతో మొదలై.. వరద ప్రవాహమై..

ఎల్‌బీనగర్‌లో జలమయమైన రోడ్లు

- రాకపోకలకు ఇబ్బందులు
- పొంగిన డ్రైనేజీలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

నాగోలు: నగరంలో కురుస్తున్న వర్షాలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. శుక్రవారం రాత్రి నుంచి ముసురుతో మొదలైన వాన వరద పారేలా దంచి కొట్టింది. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని కొత్తపేట, చైతన్యపురి, నాగోలు, మాన్సురాబాద్, హయత్‌నగర్, చంపాపేట, హస్తినాపురం, బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం పరిధిలోని కాలనీల్లో భారీగా నీరు చేరడంతో బురద కారణంగా బయటకు రాలేని దుస్థితి నెలకొంది. విద్యా సంస్థలు, వివిధ పనుల నిమిత్తం వెళ్లిన వారు నానా తంటలు పడుతూ ఇళ్లకు చేరారు. నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తిస్తూ జీహెచ్‌ఎంసీ సిబ్బంది నీటిని మ్యాన్‌హోళ్లలోకి మళ్లించారు. బండ్లగూడ మన్సూరాబాద్ రోడ్డుపై భారీ వర్షం నీరు రావడంతో అక్కడ నుంచి వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కురుస్తున్న సమయంలో చెట్లకింద ఉండొద్దని, డ్రైనేజీలు, మ్యాన్‌హోళ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మలక్‌పేట్‌జోన్ పరిధిలో..

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్‌జోన్ పరిధిలో శనివారం కురిసిన వర్షానికి కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. మలక్‌పేట్, చాదర్‌ఘాట్, దిల్‌సుఖ్ నగర్ తదితర ప్రాంతాలోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ స్తంభించింది. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, మున్సిపల్ కాలనీ, పద్మనగర్, కాలడేరా, మలక్‌పేట్ రైల్వే బ్రిడ్జి, అజంపుర, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని పలు కాలనీల్లో భారీగా నీరు నిలిచింది. పలు ప్రాంతాల్లో నాలాలు పూడుకుపోవడంతో మురుగు నీరంతా రోడ్లతో పాటు కాలనీల్లో ప్రవహించింది. మలక్‌పేట్, ఎన్‌టీఆర్‌నగర్, అల్కాపురి, భగత్‌సింగ్‌నగర్, ఓల్డ్‌మలక్‌పేట్, తీగలగూడ తదితర కాలనీలు, బస్తీలలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. వరదతో పాటు మురుగు ప్రవహించడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారు. తమ కాలనీ ఎప్పుడు ముంపునకు గురవుతుందోనని లోతట్టు, మూసీ పరీవాహక ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కార్పొరేటర్ పర్యటన..

హస్తినాపురం: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలైన ఏపీఎస్‌ఈబీ కాలనీ ద్వారకా తిరుమలకాలనీ, రెడ్డికాలనీ, సాగర్‌ఎన్‌క్లేవ్‌కాలనీ, పోచమ్మగడ్డ కాలనీల్లో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో అత్యవసరమైతేనే బయటకు రావాలన్నారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ మల్లికార్జున్, జలమండలి మేనేజర్ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు బిక్కునాయక్, సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.



హస్తినాపురం ద్వారకా తిరుమల కాలనీలో పర్యటిస్తున్న సుజాతానాయక్



జలమయంగా మారిన మార్గదర్శికాలనీ ప్రధాన రహదారి

మూసీ పరీవాహక వాసులను అప్రమత్తం చేశాం

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూసీనది పరీవాహక ప్రాంతాల వాసులను అప్రమత్తం చేశామని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం మూసీపరీవాహక ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రమాదకర పరిస్థితులు లేవని పైనుంచి గండిపేట, ఉస్మాన్‌సాగర్, ట్యాంక్‌బండ్ గేట్లు ఎత్తివేస్తే ప్రమాదకర స్థాయి చేరుకుంటుందని తెలిపారు. అదే విధంగా అధికారులందరిని అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీచేశామని తెలిపారు. కాలనీవాసులకు ఏ పరిస్థితుల్లోనైనా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాటు చేశామన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ప్రొ. లక్ష్మీనారాయణ, నాగయ్య

మన్సూరాబాద్: సిద్ధార్థ జూనియర్, డీగ్రీ కళాశాలల గ్రాడ్యుయేషన్, ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ నాగయ్య ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. గత 31 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థితికి చేరుకునేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అకాడమిక్స్ వంశీకృష్ణ, ప్రిన్సిపాల్స్ గోవర్ధని, త్రివేణి కాంచన, సల్మా సుల్తానా, కవిత, డైరెక్టర్స్ రాంరెడ్డి, మోహన్ రావు పాల్గొన్నారు.

దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి

మలక్‌పేట: దోమల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ సూచించారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డితో కలిసి డివిజన్ పరిధిలో ఫాగింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, సూపర్‌వైజర్ శివకుమార్‌తో ఫాగింగ్ వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. క్రమం తప్పకుండా యాంటీ లార్వా మందును పిచికారీ చేయాలని, ఇంటి పరిసర పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.



ఫాగింగ్ ప్రాంతాలను పరిశీలిస్తున్న డీసీ జయంత్, కార్పొరేటర్

నిత్యావసరాల పంపిణీ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ జేఎన్‌ఎంయూఆర్‌ఎం గృహ సముదాయాల్లోని పేదలకు శనివారం వికాస్ ఫౌండేషన్, కార్మిక కర్షక కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి హాజరై పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కార్మిక కర్షక కాంగ్రెస్ చైర్మన్ కౌశల్ సమీర్, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ గాయత్రీహిల్స్ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులను మేయర్ పారిజాత ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అమిత, ఏఈ సాయిరాం, కాలనీవాసులు పాల్గొన్నారు.



కుర్మల్‌గూడలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాతలు

త్రిఫ్ట్ పథకానికి నిధుల విడుదల హర్షణీయం



శైలజా రామయ్యార్‌ను కలిసిన పద్మశాలి సంఘం నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూర్చే త్రిఫ్ట్ పథకానికి సంబంధించిన నిధులు విడుదల అయ్యాయని పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ సంఘం అధ్యక్షులు పున్న గణేష్ నేత అన్నారు. ఆయన ఆధ్వర్యంలో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌ను శనివారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పున్న గణేష్ మాట్లాడుతూ.. ఎన్నో రోజులుగా నిధుల విడుదల కోసం ఎదురు చూస్తున్న నేతన్నలకు రూ. 90 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో 36,133 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేనేత కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని, ఇప్పటికే నేతన్నల భీమా పథకానికి అవసరమయిన నిధులను కూడా భీమా కంపెనీ వాళ్లకు చెల్లించినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ రెండో వారంలో హైదరాబాద్‌లో సభ నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా, త్రిఫ్ట్ పథక లబ్ధి దారులకు చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బొమ్మ రఘురాం నేత, గుర్రం శ్రావణ్, గడ్డం లక్ష్మీనారాయణ, కొకుంట్ల రవితేజ, తలాటి రమేష్, జెల్ల సూర్యకాంత్, జెల్ల జగన్నాథం, జెల్ల నరేందర్ పాల్గొన్నారు.

హిందీనగర్‌లో ‘వినాయక ఆగమన్’ కార్యక్రమం

అబిడ్స్: హిందీనగర్‌లో అభిమాన్యు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ‘వినాయక ఆగమన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విశాల్, తరుణ్, నిఖిల్ ఆధ్వర్యంలో పూజలు చేసి వినాయకుడిని మండపానికి తీసుకువచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సతీశ్‌కుమార్, ధన్‌రాజ్, కిట్టు యాదవ్ హాజరు కాగా వారిని సన్మానించారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్

- నిర్వాహకులపై కేసు

నాగోలు: తట్టిఅన్నారం పరిధిలోని గోధుల కుంటలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఏరియాలో చేపట్టిన ఏస్ వెంచర్స్ నిర్వాహకులపై నీటిపారుదల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు కేసు నమోదు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తట్టిఅన్నారం పరిధిలోని గోధులకుంట, (తట్టి కాన చెరువు) ప్రాంతం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని ఏస్ వెంచర్స్ (విల్లాస్) నిర్మాణం చేస్తున్నారు. వెంచర్స్ నిర్వాహకులు అక్రమంగా ఆర్‌సీసీ కాంపౌండ్ వాల్, బేస్‌మెంట్ నిర్మించారు. విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నోట్ బుక్కులు, బ్యాగుల పంపిణీ

యాకుత్‌పురా: మజ్లిస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ యాకుత్‌పురాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులకు శనివారం నోటు బుక్కులు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు పార్టీ తరఫున విద్యా సామాగ్రి అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి

హస్తినాపురం: వినాయక చవితి పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశిరెడ్డి అన్నారు. వనస్థలిపురం సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయబోయే గణేశ్ మండపాల నిర్వాహకులు, కార్పొరేటర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వరరెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు, సీఐ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఉస్మానియా ఆసుపత్రి పనులను అడ్డుకుంటాం’

అబిడ్స్: గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో నూతనంగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మిస్తే అడ్డుకుంటామని గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకులు వినోద్ యాదవ్, కోటి శైలేష్ కురుమలు పేర్కొన్నారు. స్థానికులతో కలిసి గోషామహల్‌లో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోషామహల్ పరిసరాల్లో లక్షలాది మంది జీవిస్తారని ఆసుపత్రి నిర్మిస్తే అందులోని మార్చురీతో వేలాది కుటుంబాలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణాన్ని విరమించుకుని ప్రస్తుతం ఉన్న అఫ్జల్‌గంజ్‌లోనే పాతభవనాలను తొలగించి కొత్త భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.